

**వైభవంగా యాదగిరీశుడి కల్యాణోత్సవం**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తిరుకల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసి పోయాయి.

# తెలంగాణ తెర్లు వెనుక కాంగ్రెస్ అసమర్థత

- అధికారం కోసమే హామీలిచ్చామన్న సీఎం రేవంత్‌రెడ్డి
- ఎన్నికల బరిలో హామీలు ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ
- తెలంగాణ ఆర్థిక పరిస్థితి అంత మంచిగలేదని వ్యాఖ్య
- కుర్చీలో కూర్చున్నంక అసలు విషయం అర్థమైందని వెల్లడి



హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తెర్లయిపోవడం వెనుక అధికార కాంగ్రెస్ అవివేకం, పాలకుల అసమర్థతతోపాటు నమ్మించి చేసిన మోసం దాగి ఉన్నట్టు తాజాగా వెల్లడైంది. రాష్ట్రంలో నెలకొన్న వ్యవసాయ, సామాజిక, ఆర్థిక సంక్షోభాలకు కాంగ్రెస్ చేసిన నమ్మకద్రోహమే ప్రధాన కారణమని తేటతెల్లమైంది. అమలు చేయలేని గ్యారెంటీలు ఇస్తే రాష్ట్రం ఆగమైపోతదని తెలిసి కూడా కాంగ్రెస్ హామీలు గుప్పించి రాష్ట్రాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేసింది. సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం ఢిల్లీలో ఓ టీవీ చానల్ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలకు కాంగ్రెస్ చేసిన నమ్మక ద్రోహానికి సాక్షిభూతంగా నిలుస్తున్నాయి. రేవంత్‌రెడ్డి, మీడియా ప్రతినిధి సంభాషణ ఇలా కొనసాగింది.

**జర్నలిస్ట్ రాజ్‌దీప్ సర్దేశాయ్:** తెలంగాణ ప్రభుత్వానికి రూ.3.75 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిసినా గ్యారెంటీల పేరిట ఎన్నికల్లో అన్ని రకాల హామీలు ఇచ్చారు. ఉదాహరణకు నిరుద్యోగులకు రూ.4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. రైతులకు, వ్యవసాయ కూలీలకు పలు హామీలిచ్చారు. ఫండ్స్ లేనప్పుడు మీరు ఇన్ని హామీలు ఎలా ఇచ్చారు?

**సీఎం రేవంత్:** తెలంగాణ అప్పులు రూ.3.75 లక్షల కోట్లు కాదు. తెలంగాణ అప్పులు రూ.7 లక్షల కోట్లు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ ఆదాయం నెలకు రూ.18,500 కోట్లు. దీంట్లో నుంచి ప్రభుత్వోద్యోగులకు వేతనాలు, పింఛన్ల చెల్లింపునకు రూ.6,500 కోట్లు ఖర్చు చేయాలి. అప్పులు, వడ్డీలకు మరో రూ.6,500 కోట్లు కట్టాలి. అలా తిన్నా తినకున్నా.. ఛాయ్ తాగినా.. తాగకపోయినా.. రూ.13 వేల కోట్లను నెలలో పదో తేదీ రాకముందే కట్టాలి. ఇక మిగిలిన రూ.5,500 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేయాల్సి ఉంది. ఇది ప్రస్తుత తెలంగాణ పరిస్థితి. తెలంగాణ అంత మంచిగేంలేదు.

**జర్నలిస్ట్ రాజ్‌దీప్:** గ్యారెంటీల సంగతేంటి? నిరుద్యోగులకు ఇస్తామన్న భృతి ఎలా?

**సీఎం రేవంత్:** సరైన ప్రశ్న వేశారు రాజ్‌దీప్ జీ.. మీలాగే, నేను కూడా తెలంగాణ అప్పులు రూ.3.75 లక్షల కోట్లని భ్రమపడ్డా. అందుకే, వచ్చే ఆదాయంతో గ్యారెంటీల కోసం ఏమైనా చేయవచ్చని అనుకొన్నా. కుర్చీలో కూర్చున్న తర్వాత అసలు విషయం తెలిసొచ్చింది.

**జర్నలిస్ట్ రాజ్‌దీప్:** (ఆశ్చర్యపడుతూ..) సీఎం కుర్చీలో కూర్చున్న తర్వాత 'గ్యారెంటీలకు డబ్బులు ఖర్చు చేయలేనని' మీకు అర్థమైందని ఇప్పుడు చెప్తున్నారా?

**సీఎం రేవంత్:** గ్యారెంటీలకు కాదు.. రుణాల చెల్లింపుల గురించి చెప్తున్నా.


**జర్నలిస్ట్ ప్రీతి:** గ్యారెంటీల గురించి అడిగితే అప్పుల గురించి చెప్తున్నారు. రెడ్డి గారూ.. దీనికి సంబంధించి నేను కొన్ని గణాంకాలు చెప్తాను. అప్పులు ఉన్నాయని తెలిసినప్పటికీ.. 2024 బడ్జెట్‌లో రూ.50 వేల కోట్లను గ్యారెంటీలకు కేటాయించారు. కొత్త అప్పులు రూ.80వేల కోట్లు చేయనున్నట్టు చెప్పారు. అప్పులు ఉన్నప్పుడు హామీలెలా ఇచ్చారు?

**సీఎం రేవంత్:** మరేం చెయ్యాలి. రేసు (ఎన్నికల పరుగుపందెం) నడుస్తుంది కదా ప్రీతీజీ! రేసులోకి (ఎన్నికల బరిలోకి) దిగాక వెనుకబడకుండా ఉండాలంటే పరుగెత్తాల్సిందే. 'స్పీడ్ థ్రిల్స్.. బట్ కిల్స్' అనే స్లోగన్ తెలుసు కదా.. ఇదీ అలాగే..! ఉచితాలకు వ్యతిరేకంగా ప్రచారం చేసిన మోదీ ఢిల్లీలో ఉచిత గ్యారెంటీలు ఇచ్చారు. మరెవ్వరూ ఆయన్ని ప్రశ్నించరేం? ప్రభుత్వం తరఫున కనీసం రూ.500 కోట్లను కూడా మూలధన వ్యయానికి, పెట్టుబడులకు ఖర్చుచేయలేని పరిస్థితి ఉంది ఇప్పుడు.

# రూపాయి పయనమెటు

న్యూఢిల్లీ, మార్చి 8: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న రక్షణాత్మక చర్యలు ఇతర దేశాల పాలిట శాపంగా మారుతున్నాయి. పలు దేశాలపై ప్రతికూల సుంకాలు విధింపుతథ్యమని హెచ్చరికలు జారీ చేయడంతో ఆయా దేశాలు బెంబేలెత్తుతున్నాయి. ఈ సుంకాల పెంపుతో దేశీయ పెట్రోకెమికల్స్, ఫార్మా ఎగుమతులపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నాయి. ఈ దెబ్బకు కరెన్సీ తీవ్ర హెచ్చుతగ్గుదలకు లోనుకావచ్చునని మార్కెట్ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. టారిఫ్ సెగతో అనూహ్యంగా అమెరికా కరెన్సీ డాలర్ విలువ బలపడుతుండటంతో దీంతో రూపాయి విలువ మరింత దిగజారుతున్నది. గడిచిన నెల రోజుల్లో డాలర్ విలువ 10 శాతం వరకు బలపడటంతో ఇతర కరెన్సీలు తీవ్ర ఒత్తిడికి గురికావాల్సి వస్తున్నదని, ఇది ఏ మాత్రం మంచిదికాదని, ముఖ్యంగా రూపాయి విలువ మరింత దిగజారుతున్నదని వెల్లడించారు. కరెన్సీ పతనమవుతుండటంతో దిగుమతి చేసుకునే వస్తువులకు అధికంగా చెల్లింపులు జరుపాల్సి వస్తుండటంతో దేశీయ ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద దెబ్బలాంటిదని అభిప్రాయపడుతున్నారు.

## సుంకాల మోతతో కరెన్సీకి మరిన్ని చిల్లులు పడే అవకాశం



ముఖ్యంగా దేశీయ వినిమయంలో 80 శాతం ఇంధనాన్ని దిగుమతి చేసుకుంటున్న భారత్‌కు ఇది ఎదురు దెబ్బ. డాలర్ బలపడిన లేదా పతనం చెందిన ఇతర దేశాల కరెన్సీలకు ముచ్చెమటలు తప్పవని హెచ్చరిస్తున్నారు. మెక్సికో, కెనడా ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్, చైనా ఉత్పత్తులపై 10 శాతం సుంకాన్ని విధించబోతున్నట్లు ఇప్పటికే ట్రంప్ ప్రకటించారు. అమెరికా దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్ కంటే భారత్ దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న టారిఫ్ అధికంగా ఉండటంతో ఇటీవల ట్రంప్ హెచ్చరికలు జారీచేశారు. ఒకవేళ సుంకాలను తగ్గించకపోతే మీమీద ప్రతికార సుంకాలను విధించాల్సి ఉంటుందని హెచ్చరించారు. దీంతో దిగొచ్చిన భారత్..అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్న ఉత్పత్తులపై విధిస్తున్న పన్నును తగ్గించేయోచనలో ఉన్నది.

### పసిడి ధరలు కూడా..

ట్రంప్ దెబ్బతో అతి విలువైన లోహాల ధరలు రాకెట్ వేగంతో దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ వాణిజ్య యుద్ధానికి తెరలేపడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాలవైపు మళ్లించడంతో వీటి ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ఇదే క్రమంలో బంగారం, వెండి ధరలు సామాన్యుడికి చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం వెండి రూ.93 వేల నుంచి రూ.97 వేల స్థాయిలో కదలాడుతున్నది. త్వరలో కిలో వెండి ఏకంగా రూ.1.15 లక్షలకు చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ వర్గాలు అంచనావేస్తున్నారు. అలాగే రూ.87 వేల స్థాయిలో కదలాడుతున్న బంగారం సమీప భవిష్యత్తులో రూ.90 వేలను తాకే అవకాశాలున్నాయి. గ్లోబల్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ 2,900 డాలర్ల నుంచి 2,940 డాలర్ల స్థాయిలో కదులుతున్నది. ఒకవేళ 3 వేల డాలర్లను దాటితే దేశీయంగా రూ.90 వేల నుంచి లక్షకు చేరుకునే ఆస్కారం ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. సుంకాల విధింపు నిర్ణయంతో ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధరలు 10 శాతం మేర పెరిగాయి. ఇదే సమయంలో బిట్‌కాయిన్ ధర 3 శాతం పడిపోయింది.

## హీరో ఫిన్‌కార్ప్‌తో మారుతి జట్టు

న్యూఢిల్లీ, మార్చి 8: పాత, కొత్త వాహనాలపై రుణాలు అందించడానికి హీరో ఫిన్‌కార్ప్‌తో మారుతి జట్టుకట్టింది. ఇందుకు సంబంధించి ఇరు సంస్థల ఉన్నతాధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందంలో భాగంగా నూతన, పాత కార్లపై హీరో ఫిన్‌కార్ప్ రుణాలు అందించనున్నది. కార్ల కొనుగోలుదారులకు తక్కువ వడ్డీకే రుణాలు లభించనున్నాయి.

## సింగరేణి అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దాం

**37వ సంయుక్త సంప్రదింపుల కమిటీ భేటీలో సీఎండీ బలరాం పిలుపు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): సింగరేణి అభివృద్ధికి సమష్టిగా పనిచేద్దామని సింగరేణి సీఎండీ ఎన్ బలరాం పిలుపునిచ్చారు. క్షమశిక్షణ, సమయపాలనతో ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని ఆయన ఆకాంక్షించారు. సింగరేణి 37వ సంయుక్త సంప్రదింపుల కమిటీ భేటీని శనివారం రెడ్ హిల్స్‌లోని సింగరేణిభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ.. సంస్థలో రెండుగనుల్లో ఒక షిఫ్ట్ మొత్తం మహిళా ఉద్యోగులతో నిర్వహిస్తామని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరో మూడు కొత్త ప్రాజెక్ట్‌లు అందుబాటులోకి రానున్నట్లు చెప్పారు. నెలరోజుల్లో ఒడిశాలోని నైనీ కోల్‌బ్లాక్ నుంచి బొగ్గు ఉత్పత్తి ప్రారంభిస్తామని వివరించారు.



శివ ప్రసాద్ రెడ్డి



గౌతమ్‌రెడ్డి

## సీఐఐ తెలంగాణ చైర్మన్‌గా శివ ప్రసాద్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 8: సీఐఐ తెలంగాణ నూతన చైర్మన్‌గా ఆర్ శివ ప్రసాద్ రెడ్డి నియమితులయ్యారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను సీఐఐ నూతన కార్యవర్గాన్ని శనివారం ప్రకటించింది. రాచమల్లు ఫోర్సింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ రెడ్డి రాచమల్లు చైర్మన్‌గా ఎంపిక కాగా, వైస్ చైర్మన్‌గా గౌతమ్ రెడ్డి ఎన్నికయ్యారు. ఫోర్సింగ్ ఇండస్ట్రీలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవం ఉన్న శివ ప్రసాద్ రెడ్డి..డిఫెన్స్, అంతరిక్ష విభాగాలకు చెందిన కీలక విడిభాగాలను ఉత్పత్తి చేసి కేంద్రానికి సరఫరా చేస్తున్నారు. అలాగే ఆయన ఎంఎస్ఎంఈ, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ ఇండస్ట్రీ విభాగాల్లో సభ్యులుగా కొనసాగుతున్నారు. అలాగే రీ సస్టైనబిలిటీ లిమిటెడ్(గతంలో రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ లిమిటెడ్) వైస్ చైర్మన్‌గా విధులు నిర్వహిస్తున్న గౌతమ్ రెడ్డి సీఐఐ తెలంగాణ వైస్ చైర్మన్‌గా ఎంపికయ్యారు.

# అమరరాజా ప్లాంట్‌తో ఉద్యోగావకాశాలు

**కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్**

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 8 : అమరరాజా గిగా ఫ్యాక్టరీ-1 పూర్తైతే తెలంగాణ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని కేంద్ర రైల్వే, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమరరాజా గిగా ఫ్యాక్టరీ-1కి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టర్ విజయేందిరబోయి, అమరరాజా గ్రూప్ కంపెనీ చైర్మన్ గల్లా జయదేవ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. దివిటిపల్లిలో నిర్మిస్తున్న అమరరాజా గిగా ఫ్యాక్టరీ శంకుస్థాపనతో ఒక ముందడుగు పడిందని, తద్వారా వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. అమరరాజా కంపెనీ 80 శాతం మహిళా ఉద్యోగులను నియమించుకోవడం అభినందనీయమన్నారు. పుష్ప సినిమా డైలాగ్‌ను ప్రస్తావిస్తూ తగ్గేదేలే అని.. దివిటిపల్లి అభివృద్ధి ఆగదు.. నిరంతరంగా కొనసాగుతుందన్నారు. అనంతరం గల్లా జయదేవ్ మాట్లాడుతూ.. రానున్న పదేండ్లలో తెలంగాణలో రూ.9,852 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్లు తెలిపారు.



మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి సమీపంలో అమరరాజా గిగా కంపెనీ-1 ప్లాంట్‌కు భూమిపూజ చేస్తున్న కేంద్ర మంత్రి అశ్వినివైష్ణవ్, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ అరుణ, ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి, కంపెనీ చైర్మన్ గల్లా జయదేవ్ తదితరులు

## మరో రూ.3,000 కోట్ల రుణానికి యత్నం

**ఆర్బీఐకి ఇండెంట్ పెట్టిన రేవంత్‌రెడ్డి సర్కారు**

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): బహిరంగ మార్కెట్ నుంచి మరో రూ.3 వేల కోట్ల రుణ సమీకరణ కోసం రేవంత్‌రెడ్డి సర్కారు శుక్రవారం రిజర్వు బ్యాంక్ (ఆర్బీఐ)కి ఇండెంట్ పెట్టింది. ఈ నెల 11న ఆర్బీఐ నిర్వహించే బాండ్ల వేలంలో పాల్గొని 24 ఏండ్ల కాల పరిమితితో రూ.1,000 కోట్లు, 27 ఏండ్ల కాలపరిమితితో రూ.1,000 కోట్లు, 28 ఏండ్ల కాల పరిమితితో మరో రూ.1,000 కోట్ల చొప్పున అప్పు తీసుకోనున్నది. ఈ నెల 4న జరిగిన బాండ్ల వేలంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.2 వేల కోట్ల రుణం పొందిన విషయం తెలిసిందే. దీంతో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన 2023 డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఆర్బీఐ నుంచి తెచ్చిన అప్పు రూ.66,827 కోట్లకు చేరింది.



### హడ్కో రుణం రూ.1,000 కోట్లు

హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (హడ్కో) నుంచి పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ (ఎంఏయూడీ) రూ.1,000 కోట్ల రుణం తీసుకున్నది. మున్సిపాలిటీల్లో మౌలిక వసతుల అభివృద్ధి కోసం హడ్కోకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వడం ద్వారా ఈ అప్పు తెచ్చింది. దీంతో ఎఫ్ఆర్‌బీఎం పరిధిలోకి రాకుండా కార్పొరేషన్లు/ఎస్పీవీల నుంచి రేవంత్‌రెడ్డి సర్కారు తెచ్చిన మొత్తం అప్పు రూ.62,991 కోట్లకు చేరింది.

# లోక్ అదాలత్‌లో సరికొత్త రికార్డు

- ఒక్కరోజే 14,18,637 కేసులు పరిష్కారం
- కక్షిదారులకు రూ.911 కోట్ల పరిహారం పంపిణీ

హైదరాబాద్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): జాతీయ లోక్ అదాలత్‌కు తెలంగాణలో అనూహ్య స్పందన లభించింది. శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో రాష్ట్రవ్యాప్తంగా 14,18,637 కేసులు పరిష్కారమయ్యాయి. వీటిలో 7,03,847 ప్రీ-లిటిగేషన్ కేసులతోపాటు వివిధ క్యాటగిరీల్లోని 7,14,790 పెండింగ్ కేసులు ఉన్నాయి. లబ్ధిదారులకు రూ.911 కోట్ల పరిహారం చెల్లింపులకు ఉత్తర్వులు వెలువడ్డాయి. హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలో జరిగిన లోక్ అదాలత్‌లను జస్టిస్ అభినంద్ కుమార్ షావిలీ పర్యవేక్షించారు. వరంగల్, హనుమకొండలో నిర్వహించిన లోక్ అదాలత్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య వర్చువల్‌గా, జస్టిస్ కే లక్ష్మణ్ స్వయంగా ప్రారంభించారు. అనంతరం కక్షిదారులకు ఏసీజే సుజోయ్ పాల్, జస్టిస్ కే లక్ష్మణ్ పరిహార చెక్కులు పంపిణీ చేశారు. కేసుల పరిష్కార వివరాలను రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శి సీహెచ్ పంచాక్షరి మీడియాకు విడుదల చేశారు.

### హైకోర్టులో 165 కేసుల పరిష్కారం

హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన లోక్ అదాలత్‌లో జస్టిస్ జే అనిల్ కుమార్, జస్టిస్ నందికొండ నర్సింగరావు ధర్మాసనం 165 కేసులను పరిష్కరించింది.



హనుమకొండలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్‌పాల్ సమక్షంలో దండలు మార్చుకుని మళ్లీ ఒక్కటైన భార్యాభర్తలు



ఎస్సారెస్పీ కెనాల్‌లోకి కారు దూసుకెళ్లిన ప్రాంతం వద్ద గుమిగూడిన స్థానికులు



ప్రమాదంలో మృతిచెందిన సోమారపు ప్రవీణ్, కుమారుడు హర్షవర్ధన్ (ఫైల్)

# కెనాల్‌లోకి దూసుకెళ్లిన కారు

- ఒకే కుటుంబంలో ముగ్గురు మృతి
- మృతుల్లో తండ్రి, ఇద్దరు చిన్నారులు
- స్థానికుల సాయంతో క్షేమంగా బయటపడిన భార్య
- వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులో ఘటన
- మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లిలో విషాదం

పర్వతగిరి, మార్చి 8 : ఎస్సారెస్పీ కెనాల్‌లోకి కారు దూసుకెళ్లి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందిన ఘటన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కొంకపాక శివారులో శనివారం జరిగింది. పర్వతగిరి సీఐ రాజగోపాల్, బంధువుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మం డలం మేచరాజుపల్లికి చెందిన సోమారపు ప్రవీణ్(45) వరంగల్‌లో ఎస్ఐసీలో డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నాడు. రెండో శనివారం, ఆదివారం సెలవులు రావడంతో భార్య కృష్ణవేణి, కూతురు సాయిచైత్ర(5), కుమారుడు హర్షవర్ధన్ (2)తో కలిసి కారులో వరంగల్ నుంచి స్వగ్రామం మేచరాజుపల్లికి బయలు దేరారు. మార్గమధ్యంలో తనకు ఛాతిలో నొప్పి వస్తున్నదని చెపుతుండగానే కారు కంట్రోల్ తప్పి పక్కనే ఉన్న ఎస్సారెస్పీ కాలువలోకి దూసుకెళ్లింది. వెంటనే కృష్ణవేణి కారు అద్దాలను దింపి కుమారుడిని బయటకు విసిరి, తానూ దూకేసింది. కారుతో పాటు ప్రవీణ్, కూతురు చైత్ర కాల్వలో కొట్టుకుపోయారు. కృష్ణవేణిని స్థానికులు కాపాడగా, కుమారుడు అప్పటికే మృతి చెందాడు.

# ఎండకు పంటలు ఎండితె నన్ను తిడుతుండ్రు!

I తరువాయి...

విధిస్తూ ముప్పుతిప్పలు పెడుతున్న సర్కారు కాఠిణ్యానికి రైతులు అల్లాడుతున్న విషయాన్ని గుర్తుచేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో వారిని ఓదార్చి, వాళ్లకు చేతనైన సాయం చేయాల్సిన ముఖ్యమంత్రి శనివారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా సంఘాల సభ్యులతో జరిగిన సభ వేదికగా పెడబొబ్బలు పెట్టడం, తనను తిడుతున్నారంటూ సానుభూతి కోసం పాకులాడం వింతగా, వికారంగా ఉన్నదని విశ్లేషకులు అంటున్నారు. పంటలు ఎండిపోతుంటే, జనం చనిపోతుంటే ఆ బాధతో ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి కానీ, తనను తిడితే ఏమొస్తుందని బహిరంగ వేదిక మీదనే చెప్పడానిన తన అసమర్థతను కప్పిపుచ్చుకునే ప్రయత్నమని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. తనను తిట్టే బదులు ప్రభుత్వానికి అండగా నిలబడాలని, పదేండ్ల పాలనా అనుభవంతో ప్రభుత్వానికి సూచనలు చేయాలని ప్రతిపక్ష బీఆర్ఎస్‌ను కోరడం సర్కారు చేతగాని తనమేనని వారు అంటున్నారు. తనకు ప్రభుత్వంపై, పరిపాలనపై పట్టురావడం లేదని.. మంత్రులు, అధికారులు తన మాట వినడం లేదని.. తనకు సలహాలు ఇచ్చి కాపాడాలని ఇటీవల ఒక సీనియర్ నేత ఇంటికి వెళ్లి వేడుకున్న తర్వాతే ముఖ్యమంత్రి నుంచి 'నన్ను తిడుతున్నరు' అనే వ్యాఖ్యలు రావడం ఆసక్తికరమని ప్రముఖ రాజకీయ పరిశీలకులు ఒకరు విశ్లేషించారు. పరిపాలనాపరమైన వైఫల్యం నుంచి జనం దృష్టి మళ్లించి సానుభూతిని కొట్టేసేందుకు చేసిన విఫల యత్నమని, ఛీప్ ట్రాక్టిక్ అని ఆయన పేర్కొన్నారు. చిన్నచిన్న ప్రమాదాలకు కూడా తననే బాధ్యుడిని చేయడమేమిటని సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి చెప్పడాన్ని పలువురు తప్పుబడుతున్నారు. 'సీఎం చిన్న చిన్న ప్రమాదాలు అని చెప్పడం విడ్డూరం. నిరుడు పెద్దవాగు మొత్తం కొట్టుకుపోయి పెద్ద ప్రమాదం జరిగింది. ఆ తర్వాత సుంకిశాల రిటైనింగ్ వాల్ కొట్టుకుపోయి తీవ్ర నష్టం జరిగింది. ఇటీవల అవగాహన లేకుండా, కనీస జాగ్రత్తలు పాటించకుండా గొప్పలకుపోయి హడావుడిగా చేసిన పనుల కారణంగా ఎస్ఎల్‌బీసీ సొరంగంలో భారీ ప్రమాదం జరిగింది. సర్కారు నిర్లక్ష్యం కారణంగా 8 మంది కార్మికులు బలయ్యారు. వారి అస్థికలు కూడా దొరికే పరిస్థితి లేదు. ఆ ప్రాజెక్టే ప్రమాదంలో పడింది. భవిష్యత్తులో మళ్లీ చేపట్టే అవకాశం లేకుండాపోయింది. ఇది చిన్న ప్రమాదం ఎలా అవుతుంది? సీఎం ఇలా బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం హేయం' అని సీనియర్ జర్నలిస్ట్ ఒకరు ప్రభుత్వాన్ని ఏకిపారేశారు.



ఇందిరా మహిళాశక్తి బస్సును ప్రారంభిస్తున్న రేవంత్‌రెడ్డి తదితరులు

### కావాలనే కాళేశ్వరాన్ని ఎండబెట్టి

సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తెలంగాణ రైతాంగం తీవ్రంగా స్పందించింది. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా, ప్రాజెక్టులను నిర్వహించే తెలివి కాంగ్రెస్ సర్కారుకు లేదని అన్నదాతలు విమర్శిస్తున్నారు. తెలంగాణ జలప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టు, రిజర్వాయర్లను ఏడాదికాలంగా కావాలనే ఎండబెట్టబెట్టి వ్యవసాయాన్ని విధ్వంసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఇవాళ నీటి సమస్యను అధిగమించటానికి పదేండ్ల పరిపాలనా అనుభవంతో సూచనలు చేయాలని కోరటం విడ్డూరమని విమర్శిస్తున్నారు. పైగా ఎండాకాలంలో పంటలు ఎండిపోతున్నాయని చెప్పడంపై వ్యవసాయ నిపుణులు మండిపడుతున్నారు. 'ఎండాకాలం అంటేనే ఎండలుంటయి. ఎండాకాలంలో ఎండలుండక వానలుంటయా? ఎండలున్నప్పుడే సరైన రీతిలో నీళ్లిచ్చి పంటలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటది. అది చేయలేక ఎండకాలం ఎండలున్నయి కాబట్టే పంటలు ఎండిపోయినయి. వానకాలంలో వరదలు వచ్చినయి కాబట్టే పంటలు కొట్టుకుపోయినయని చెప్పడానికి ప్రభుత్వమెందుకు? ఇన్ని వ్యవస్థలు ఎందుకు? ఇంత మంది అధికారులు ఎందుకు' అని వ్యవసాయ శాస్త్రవేత్త ఒకరు ఆక్షేపించారు.

### సీఎం ఇట్లంటే ప్రజలు ఎక్కడికిపోవాలి?

పంటలు ఎండిపోతున్న వేళ ఏం చేయాలో పాలుపోక ప్రతిపక్షాల సలహాలు, సూచనలు అంటూ కపట నాటకానికి తెరలేపారని రేవంత్‌రెడ్డి తీరును పలువురు విమర్శిస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు సలహాలు, సూచనలు ఇవ్వటానికి కంటే ముందు సీఎంగా రేవంత్‌రెడ్డి నీళ్ల సమస్యకు మూలకారణం ఏమిటో చిత్తశుద్ధితో వివరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. కేవలం కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న లక్ష్యంతోనే బంగారం లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును ఎండబెట్టారని మండిపడుతున్నారు. 300 పిల్లర్లున్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో ఒక పిల్లర్‌లో సమస్య వస్తే మొత్తం ప్రాజెక్టునే ఏడాదికాలంగా పడావు పెట్టారని, ట్రయల్ రన్ పూర్తి చేసుకున్న పాలమూరు ఎత్తిపోతల నుంచి ఇప్పటి వరకు చుక్క నీళ్లు కూడా ఇవ్వలేదని ధ్వజమెత్తుతున్నారు. నీళ్ల సమస్యను అధిగమించటానికి సలహాలు ఇవ్వమని అడగటం రాజకీయ బికారితనమని బీఆర్ఎస్ శ్రేణులు అంటున్నాయి. కృష్ణా, గోదావరి ఆయకట్టులో పొలాలు ఎండిపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పాపమేనని అంటున్నారు. గోదావరిలో నీటి లభ్యత ఉన్నా ఇసుక వ్యాపారం కోసం రైతుల కడుపు కొడుతున్నారని విమర్శిస్తున్నారు. 'రాష్ట్రంలో నీటిని నిల్వ చేసుకునేందుకు కేసీఆర్ ప్రభుత్వం కట్టిన జలాశయాలు, బాగుచేసిన చెరువులు సిద్ధంగా ఉన్నయి. ఈసారి వానకాలంలో అద్భుతంగా వానలు పడ్డయి. రికార్డుస్థాయిలో నదులకు అనేక నెలల పాటు వరదలు వచ్చినయి. ఇన్ని ఏర్పాటు ఉన్నయి. ఈ నీళ్లతో చెరువులు, రిజర్వాయర్లు ముందే నింపుకోకుండా ఇప్పుడు పంటలు ఎండుతున్నయని సీఎం అంటున్నరు. ఇంతకంటే హాస్యాస్పదమైన విషయం ఇంకొకటి ఉండదు. ఒక ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తే ఈ మాటలంటే ఇక ప్రజలు వారి బాధలు ఎవరికి చెప్పుకుంటరు? ఇక ప్రజలు ఎక్కడికిపోవాలి? ప్రజలు ఏమైపోవాలి? ఇట్ల మాట్లాడితే సానుభూతి వచ్చే సంగతేమో గానీ, ప్రజల తీవ్ర ఆగ్రహాన్ని చవిచూడక తప్పదు ' అని బీఆర్ఎస్ సీనియర్ నేత ఒకరు దుయ్యబట్టారు.

### గతంలోనే సవాల్ విసిరిన హరీశ్

ఒక్క కన్నెపల్లి పంప్‌హౌస్ బటన్ ఆన్ చేస్తే చాలని యాసంగి పంటలకు సరిపోయేంత నీళ్లు వస్తాయని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ నీళ్ల మంత్రి హరీశ్‌రావు చెప్పారు. కాళేశ్వరం తమ చేతికిస్తే కేవలం మూడు రోజుల్లో ఈ ఎండాకాలంలో కూడా రైతాంగానికి నీళ్లు అందిస్తామని, చివరి ఆయకట్టు వరకు జలాలు పారిస్తామని గతంలో హరీశ్‌రావు విసిరిన సవాల్‌ను ఈ నేపథ్యంలో నెటిజన్లు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో ప్రతి ఎకరానికి నీరందించామని, కాంగ్రెస్ ఇసుక వ్యాపార దాహానికి రైతులు నష్టపోతున్నారని ఆయన ఆరోపించారు. సలహాలు, సూచనలు అంటూ ప్రతిపక్షాలను బద్నాం చేసే ఎత్తుల కంటే, కాళేశ్వరం నీళ్లతో సాగులో ఉన్న పంటలనైనా కాపాడాలని డిమాండ్ చేశారు. పదేండ్ల పాటు సంతోషంగా సాగిన సాగును కన్నీటి సేద్యం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రైతాంగానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అవసరమైన మరమ్మతులు చేసి రివర్స్ పంపింగ్ ద్వారా యుద్ధప్రాతిపదికన రిజర్వాయర్లు, చెరువులు, కాల్వలు నింపి పంటలు కాపాడాలని పేర్కొన్నారు. ఈ సీఎంను అన్నదాతలు ఎప్పటికీ క్షమించరని చెప్పారు. గతంలో హరీశ్‌రావు చెప్పినట్టు.. బీఆర్ఎస్‌కు కాళేశ్వరం ప్రాజెక్టును అప్పగించి ఉంటే ఇవ్వాళ ఈ కష్టం వచ్చేది కాదని రైతన్నలు చెబుతున్నారు. పంటలు ఎండేవి కావని, అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వచ్చేది కాదని చెబుతున్నారు.

# కూరగాయలతోపాటే ఇసుక!

I తరువాయి...

ఆదేశాలు జారీచేశారు. ప్రజలకు అందుబాటులోకి ఇసుకను తెచ్చే నెపంతో తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ మార్కెట్లు ధాన్యం నిల్వలతో, కూరగాయలు, పండ్లు వంటి లావాదేవీలతో, వందలాది ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, లారీల రాకపోకలతో రద్దీగా ఉంటాయి. ఇలాంటి మార్కెట్లలో డంపర్ల ద్వారా ఇసుకను తెచ్చి కుప్పలుగా పోస్తే తమకు తీవ్రనష్టం తప్పదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే కొన్ని సీజన్లలో మార్కెట్లలో వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుందని, వేలాది మంది రైతులతో నిండిపోతాయని చెప్తున్నారు. ఇలాంటి సమయంలో పెద్దపెద్ద డంపర్లతో ఇసుకను తరలిస్తే ప్రమాదాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అంతేకాదు వాహనాల నుంచి రాలిపోయే ఇసుక ధాన్యంలో కలిసిపోతుందని, కూరగాయలపై దుమ్ము పేరుకుపోతుందని చెప్తున్నారు. తద్వారా వినియోగదారులకు ఇసుకతో కూడిన కూరగాయలు చేరుతాయన్నారు. కొన్ని రకాల కూరగాయలను ఎంత కడిగినా ఇసుక పోదని వివరిస్తున్నారు. ఇది రైతులకు, ప్రజలకు తీవ్రనష్టం కలిగిస్తుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంతేకాకుండా ఇసుకను మోసుకొచ్చే డంపర్లు, కొనుగోలుదారుల లారీలు, ట్రాక్టర్లు తదితర వాహనాల రాకపోకలతో రద్దీ పెరుగుతుందని, మార్కెట్లలో మౌలిక వసతులు దెబ్బతింటాయని వివరిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయంపై పునరాలోచించాలని ప్రతిపక్ష, ప్రజాసంఘాలనేతలు డిమాండ్ చేస్తున్నారు.

### సర్కారు తెలివితక్కువ నిర్ణయం

కూరగాయల మార్కెట్లలో ఇసుక యార్డులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలా రోజుకొక తెలివి తక్కువ నిర్ణయం తీసుకుంటూ తమకు పాలన చేతకావడంలేదని చెప్పకుంటున్నది. ముఖ్యంగా మైనింగ్ విభాగంపై పట్టు కోల్పోయినట్టు స్పష్టమవుతున్నది. ప్రభుత్వం పర్యావరణ నిబంధనలను తుంగలో తొక్కుతూ ఇసుక లోడింగ్ సమయాన్ని రాత్రి 9 గంటలకు పొడిగించింది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో వేలాది మంది సాధారణ లారీ ఓనర్లు, డ్రైవర్ల నోట్లో మట్టి కొట్టింది. ఇప్పుడు మార్కెట్ యార్డుల్లో ఇసుక అమ్మకాలంటూ మరో తెలివి తక్కువ నిర్ణయం తీసుకున్నది. కూరగాయల మార్కెట్లలో రైతులు, అమ్మకందారులు, కొనుగోలుదారులతో నిత్యం రద్దీగా ఉంటుంది. ఇలాంటి చోట్ల వందలాది ఇసుక లారీలు వచ్చి వెళ్తే ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టినట్టే.

-మన్నె క్రిశాంక్, బీఆర్ఎస్ నేత